నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
3 కరీంనగర్, శనివారం 17 ఫిబ్రవరి 2024 RAJANNA SIRCILLA

# మానేరు రివర్‌ఫ్రంట్‌కు నిధులు కేటాయించాలి

**అసెంబ్లీలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



కార్పొరేషన్, ఫిబ్రవరి 16 : కరీంనగర్‌లో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అసెంబ్లీలో కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును ₹450 కోట్లతో ప్రారంభించారని గుర్తు చేశారు. నీటిపారుదల, పర్యాటక శాఖ సమన్వయంతో టెండర్ చేసుకొని 70 శాతం పనులు కూడా పూర్తి చేశామని, మరో 30 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అలాగే కులగణన తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణనను పకడ్బందీగా చేపట్టాలని, దీనిపై తీర్మానం కాకుండా చట్టం చేస్తే బాగుంటుందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.

హ్యాపీ బర్త్‌డే కేసీఆర్

## కేసీఆర్ దీవెనతోనే
# నేను డాక్టర్ అయ్యా

- మాకే కాదు.. అమరుల కుటుంబాలన్నింటికీ పెద్దదిక్కుగా నిలిచారు
- తెలంగాణ తెచ్చి మా డాడీ కల నెరవేర్చారు
- మమ్మల్ని కన్నబిడ్డల్లా చూసుకున్నారు
- నన్ను మెడిసిన్‌లో పీజీ చేయిస్తున్నారు
- ఆయన పుట్టిన రోజు మాకు పండుగ
- నేడు కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా కానిస్టేబుల్ పుట్టకొక్కుల కిష్టయ్య కూతురు డాక్టర్ ప్రియాంక



పుట్టకొక్కుల ప్రియాంక

కరీంనగర్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఫస్ట్ సీఎం కేసీఆర్ తమకే కాదు, అమరుల కుటుంబాలన్నింటికీ పెద్దదిక్కుగా నిలిచారని అమరుడు కానిస్టేబుల్ పుట్టకొక్కుల కిష్టయ్య కూతురు డాక్టర్ ప్రియాంక గుర్తు చేస్తున్నారు. తమను కన్నబిడ్డలా చూసుకున్నారని, ఉద్యమ సమయం నుంచే 'నేనున్నా'ంటూ భరోసానిచ్చారని ఉద్వేగానికి లోనయ్యారు. ఆయన దీవెనతోనే తాను డాక్టర్‌ను అయ్యాయని, ఇప్పుడు పీజీ చేస్తున్నాని చెబుతున్నారు. శనివారం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో తన కుటుంబాన్ని ఆదుకున్న తీరును పంచుకున్నారు. ఏ తెలంగాణ కోసమైతే తన తండ్రి కిష్టయ్య ప్రాణ త్యాగం చేశారో.. ఆ తెలంగాణను సాధించి తన తండ్రి కన్నకలను కేసీఆర్ సాకారం చేశారని, తనను డాక్టర్ చేయాలన్న మరో కలను నిజం చేశారని చెబుతున్నారు. ఆమె మాటల్లోనే.. 'డాడీ చనిపోయినపుడు అన్నయ్య, నేను చిన్న పిల్లలం. ఆ తర్వాత చాలా రోజులకు తెలంగాణ వచ్చింది. అప్పటికీ మేం కాస్త పెద్దయినం. తెలంగాణ రావడంతో చాలా సంతోషించిన. డాడీ కల నెరవేరింది అనుకున్న. డాడీకి రెండే రెండు కోర్కెలు ఉండేవి. ఒకటి తెలంగాణ రాష్ట్రాన్ని చూడడం, నన్ను డాక్టర్ని చేయడం. సీఎం కేసీఆర్ సార్ ఈ రెండు కోర్కెలను నెరవేర్చిండు. డాడీ చనిపోయిన తర్వాత కేసీఆర్ సార్‌ను మా అమ్మ పద్మావతితో వెళ్లి కలిసిన. అప్పుడు ఎంతో ఆప్యాయంగా మాట్లాడిండు. మాకు భోజనం పెట్టించి పంపిండు. నన్ను దగ్గరికి తీసుకుని బాగా చదువుకోవాలని చెప్పిండు. మళ్లీ నా ఇంటర్ పూర్తయిన తర్వాత 2015లో కలిసినం. అప్పుడు నన్ను డాక్టర్‌ని చేయాలన్న మా డాడీ కోరిక చెప్పిన. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఎంట్రెన్స్ రాయాలని చెప్పిండు. నేను ఎంట్రెన్స్ రాసిన. నాకు కరీంనగర్‌లోని చల్మెడ మెడికల్ కాలేజీలో సీటు ఇప్పించి ఫీజు మొత్తం చెల్లించిండు. ఎంబీబీఎస్ కాగానే బస్తీ దవాఖానలో మెడికల్ ఆఫీసర్‌గా కాంట్రాక్ట్ బేస్‌పై ఉద్యోగంలో చేరిన. కానీ, మెడిసిన్‌లో పీజీ చేయాలనే కోరిక అలాగే ఉండి పోయింది. హైదరాబాద్‌లో అమర జ్యోతి ఆవిష్కరణ రోజు మమ్మల్ని పిలిస్తే మరోసారి సార్‌ను కలిసినం. పీజీ చేయాలనుందని చెప్పిన. నీట్ రాయాలని చెబితే రాసిన. చల్మెడ మెడికల్ కాలేజీలోనే సీటు ఇప్పించిండు. ₹24 లక్షలు చెల్లించేందుకు ఒప్పుకున్నడు. నిజంగా కేసీఆర్ సార్ గ్రేట్. ఆయన మాటలు చెప్పే నాయకుడు కాదు, ఏదైనా ఆచరణలో చేసి చూపిస్తడు. మాలాంటి ఎన్నో అమరుల కుటుంబాలను నిలబెట్టిండు. అందుకే ఆయనంటే అమరుల కుటుంబాలన్నింటికీ ఇష్టం, అభిమానం. మొన్న కేసీఆర్ సారుకు దెబ్బ తగిలినపుడు మా కుటుంబ సభ్యులు వెళ్లి కలిసినం' అని చెప్పారు. కేసీఆర్ సార్ ఎప్పటికీ తమ గుండెల్లో నిలిచి ఉంటారని, ఆయన ప్రతి పుట్టినరోజు మా ఇంట్లో పండుగలా చేసుకుంటామని, తమ ఇంట్లో ఇంతకన్న పెద్ద పండుగ ఉండదని ప్రియాంక కృతజ్ఞత చెప్పారు. 'హ్యాపీ బర్త్‌డే కేసీఆర్ సార్' అంటూ శుభాకాంక్షలు తెలిపారు.



కరీంనగర్ బస్టాండ్ ఎదుట ఆటోలు నిలిపి నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

# కదంతొక్కిన ఆటో కార్మికులు

**ఉమ్మడి జిల్లాలో బంద్ సక్సెస్**

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 16: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికులు తమ వాహనాలను నిలిపివేసి కదం తొక్కారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా కేంద్రాలతో పాటు పట్టణాలు, మండలకేంద్రాల్లో ప్లకార్డులు పట్టుకుని ధర్నా, రాస్తారోకోలు చేశారు. రోడ్లపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ నిరసనలు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తమకు ఉపాధి లేకుండా పోయిందని, తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 23 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు ₹10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి డ్రైవర్‌కు నెలకు ₹15వేలు జీవనభృతి కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జీవితాలతో చెలగాటం ఆడద్దు

**మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**



ఆటోడ్రైవర్లకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్,బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 16 : ఆటో డ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడొద్దని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కాంగ్రెస్ సర్కారును కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తంగళ్లపల్లిలో ఆటో డ్రైవర్లు చేపట్టిన బంద్‌కు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు బొల్లి రామ్మోహన్‌తో కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. గతంలో పదేళ్ల కిందట తాము ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, టాక్సీ రద్దు చేసి అండగా నిలిచామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డు పడ్డారని, కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆటో డ్రైవర్లకు నెలకు ₹15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు జీరో టికెట్ కాకుండా వారి ప్రయాణానికి ప్రభుత్వం డబ్బులు ఇస్తే బాగుంటుందని, బస్సులు లేకపోతే ఆ డబ్బులతో ఆటోలోనూ ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆటో డ్రైవర్ల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు యాదవ్, అక్కరాజు శ్రీనివాస్, మాట్ల మధు, సిలువేరి చిరంజీవి పాల్గొన్నారు.

# బండి.. ఏం చేశావో చెప్పు

- వ్యక్తిగత విమర్శలు మానుకో.. అభివృద్ధి గురించి మాట్లాడు
- నేను కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, రైల్వే లైన్, జాతీయ రహదారులు తెచ్చిన
- పార్లమెంట్ నియోజకవర్గానికి నీవు ఏం తెచ్చినవ్
- సీఎం రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించాలి
- రైతాంగానికి అండగా బీఆర్ఎస్
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16: ఎంపీ బండి సంజయ్ మతోన్మాద రాజకీయాలు మానుకొని ప్రజాహితం కోసం పనిచేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హితవు పలికారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, రైల్వే లైన్, జాతీయ రహదారులు తెచ్చానని చెప్పారు. కానీ, సంజయ్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో విమర్శలు రాజకీయంగా ఉండాలి కానీ, వ్యక్తిగతంగా చేయకూడదని సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ తెలంగాణ ప్రజల సమస్యలను పరిష్కరించలేవని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంజయ్ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న సమయంలో తనపై వ్యక్తిగతంగా చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఎల్‌అండ్‌టీని బెదిరించినట్టు చేసిన విమర్శలను తాను ఖండిస్తే ఆయన ఇప్పటి వరకు కనీసం స్పందించలేదన్నారు. హైదరాబాద్‌లో ₹500 కోట్ల ఆస్తి ఉందని ఆరోపణలు చేశాడని, నిరూపిస్తే ఆయనకే రాసిస్తానని సవాల్ విసిరారు. రాజకీయ నాయకులు పార్టీ సిద్ధాంతాలపై మాట్లాడాలని, వ్యక్తిగత విషయాలపై స్పందించడం రాజకీయ చతురత కాదని చెప్పారు. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న క్రమంలో గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో గ్రామాలకు కోట్లాది రూపాయలు తెచ్చినట్టు బండి ప్రచారం చేసుకున్నాడని, అయితే.. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ₹5 కోట్ల ఎంపీ నిధులు వస్తాయని, ఉపాధి హామీ పథకం, హరితహారం, అంగన్‌వాడీ, ప్రధాన మంత్రి సడక్ యోజనకు ఖర్చు చేసిన నిధులను ఫ్లెక్సీల్లో రూపొందించారని, దీంట్లో ఆయన ప్రత్యేకంగా చేసింది ఏముందో చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదాతోపాటు ₹వెయ్యి కోట్ల నిధులు సాధించానని గర్వంగా చెబుతున్నానన్నారు. 60 ఏండ్ల కరీంనగర్ ప్రజల ఆకాంక్ష అయిన కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ మంజూరు చేయించానని, ఈ లైన్ పనులు సిద్దిపేట వరకు పూర్తయ్యాయని, త్వరలోనే సిరిసిల్ల మీదుగా పనులు జరగబోతున్నాయన్నారు. ఎల్కతుర్తి- హుస్నాబాద్- మెదక్- పిట్లం జాతీయ రహదారిని తెచ్చామని, దీనికి భూసేకరణ పూర్తయి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కరీంనగర్‌లో ఎన్సీ నేషనల్ హైవేస్ కార్యాలయం ప్రారంభించామని, కొత్తపల్లిలో ట్రిపుల్‌ఐటీ కాలేజీ కోసం కలెక్టర్ ద్వారా కేంద్రానికి లేఖ పంపామని చెప్పారు. బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నా ఒక్క నవోదయ విద్యాలయం మంజూరు చేయించలేకపోయారని మండిపడ్డారు. అభివృద్ధి గురించి మాట్లాడాల్సింది పోయి కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితం కావడం బాధాకరమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల మల్టీప్లెక్స్‌పై విమర్శలు చేశాడని, రాష్ట్రం మొత్తంలోనే ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్న సంస్థ అదొక్కటేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, ఆయన ఎంపీగా ఉన్న సమయంలోనే మల్టీప్లెక్స్‌కు స్థలం కేటాయించారని, ఆ విషయం గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలుకావడం లేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో హుందాగా వ్యవహరించాల్సిన అవసరముందని సూచించారు. ప్రతి క్వింటాల్ ధాన్యానికి రైతులకు ₹500ల బోనస్ ఇస్తున్నారో లేదో ఆయన అసెంబ్లీలో చెప్పాలని డిమాండ్ చేశారు. మార్చి చివరి నుంచి వరి కోతలు ప్రారంభం కాబోతున్నాయని, ప్రతి క్వింటాల్‌కు బోనస్ చెల్లించేదాకా విశ్రమించబోమని స్పష్టం చేశారు. ఎంఎస్‌పీకి అదనంగా బోనస్ తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, కుంబాల మల్లారెడ్డి, జక్కుల నాగరాజు, గజభీంకార్ రాజన్న, బొల్లి రామ్మోహన్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు పాల్గొన్నారు.




కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట నినదిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

# సమ్మె సక్సెస్


కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విజయవంతమైంది. కార్మికులు, రైతులు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి, నిరసనలు చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సమ్మెలో బీఆర్ఎస్ కార్మిక విభాగంతోపాటు సీపీఎం, సీపీఐ, టీడీపీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, ఆర్ఎస్‌పీ, తదితర పార్టీలు వాటి అనుబంధ సంఘాలతో పాటు మెడికల్ రిప్‌లు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, మున్సిపల్, పంచాయతీ కార్మికులు, హమాలీలు, రైస్ మిల్ ఆపరేటర్లు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు తదితర 50 రంగాలకు చెందిన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు.

**- కరీంనగర్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ)**

# క్లాస్ రూముల్లో సెల్ ఫోన్లు వాడొద్దు

- పెద్దపల్లిలో టీచర్లకు డీఈవో ఆదేశాలు
- నిబంధనలు పాటించాలని ఉత్తర్వులు
- అతిక్రమిస్తే చర్యలుంటాయని హెచ్చరికలు

నమస్తే ఎఫెక్ట్



డీఈవో ఇచ్చిన ఉత్తర్వు కాపీ

పెద్దపల్లి, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): వ్యక్తిగత పనుల కోసం తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగించడం పూర్తిగా నిషేధం. అందుకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులున్నా మెజార్టీ ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదు. బోధనను ఆపేసి మధ్యమధ్యలో ఫోన్లు మాట్లాడడం వల్ల విద్యార్థుల చదువులపై ప్రభావం పడుతున్నది. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు, పిల్లల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. దీనిపై జగిత్యాల జిల్లాలో విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి స్పందించి ఇటీవల ఉత్తర్వులు జారీ చేయగా, మిగిలిన జిల్లాల్లో చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఈ నెల 15న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'తరగతి గదుల్లో సెల్ ఫోన్లు.. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ఉపాధ్యాయులు' శీర్షికన కథనం ప్రచురితం కాగా, పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి మాధవి స్పందించారు. శుక్రవారం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీని వల్ల టీచర్ల ఏకాగ్రత దెబ్బతిని బోధన కష్టమవుతుందని చెప్పారు. దాంతోపాటు విద్యార్థుల దృష్టి చదువు నుంచి మళ్లుతుందన్నారు. పాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత అలాగే కేజీబీవీ, మోడల్ స్కూళ్ల హెచ్‌ఎంలు, ప్రినిపాల్స్‌కు తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇప్పటికే ఇచ్చిన సూచనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో టీచర్లు స్మార్ట్‌ఫోన్ వినియోగించుకోవడానికి అనుమతి లేదని, క్లాస్ రూముల్లో విద్యార్థుల ఫేస్ రికగ్నిజేషన్ తీసుకునేటప్పుడు, ఇంటర్నెట్ వినియోగించి ఏదైనా పాఠం చెప్పాల్సి వచ్చినప్పుడు, అలాగే అధికారిక సమాచారం ఏదైనా ఇవ్వాల్సి ఉన్నప్పుడు మాత్రమే హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు అనుమతి తీసుకొని వినియోగించాలని సూచించారు. కానీ, ఇతర కార్యకలాపాలకు ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. పని పూర్తయిన తర్వాత సెల్‌ఫోన్లను మళ్లీ ఇనిస్టిట్యూషన్ హెడ్ కస్టడీలో జమ చేయాలని ఆదేశించారు. సూచనలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు.







